www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 219 | బుధవారం | 22 జనవరి, 2025




# దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

- కామారెడ్డిలో పామాయిల్ యూనిట్ ఏర్పాటు
- తెలంగాణ ప్రభుత్వంతో యూనిలీవర్ ఒప్పందం

**హైదరాబాద్, జనవరి 21:** కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్‌లో జరిగిన సమావేశంలో సిఎం రేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందం మిగతా 2 లో




## ప్రజానావ క్యాలెండర్ ఆవిష్కరణ

### సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి, ప్రజానావ : అనతికాలంలోనే పత్రికా రంగంలో ప్రజానావ పత్రిక తనకంటూ ఓ గుర్తింపును సొంతం చేసుకుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన బెజ్జంకిలో ప్రజానావ దినపత్రిక 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికా రంగంలో నికార్సైన వార్తలు రాస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా నిలుస్తోన్న ప్రజానావ దినపత్రిక సిబ్బంది, యాజమాన్యాన్ని అభినందించారు. నిజాలను నిర్భయంగా రాస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిందని, ముున్ముందు మంచి వార్తలతో సమాజాభివృద్ధికి పాటుపడాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,ఏఎంసి చైర్మన్ పులి క్రిష్ణ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిలేని శ్రీనివాస్ రెడ్డి,బైర సంతోష్, మహంకాళి ప్రవీణ్,అధికార ప్రతినిధి జనాగం శంకర్, వడ్లూరి పర్శరాములు, ప్రజానావ ప్రతినిధి బోనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

## ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి

- ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం
- చలపతి సహా పలువురు అగ్రనేతలను మట్టుబెట్టిన బలగాలు
- నక్సల్స్ లేని భారత్ దిశగా అడుగులు అంటూ అమిత్‌షా

04

ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దులోని జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మంగళవారం హతమయ్యారు. 19న రాత్రి నుంచి పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మావోయిస్టులు మృతి చెందారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 16 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయ్‌పుర్ జోన్ ఐజీ అమ్రేశ్ మిశ్ర వెల్లడించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం కూడా కాల్పులు కొనసాగగా, అనేక మంది నక్సల్స్ నేలకొరిగారు. ఎదురు కాల్పులు కొనసాగుతుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎదురుకాల్పుల్లో బీఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు జవాన్లకు గాయాలు అయ్యాయి. కాగా, ఇక, నక్సల్స్ లేని భారత్ దిశగా మన ప్రయాణం కొనసాగుతుందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు. ప్రస్తుతం దేశంలో నక్సలిజం చివరి దశలో ఉందని ఎద్దేవా చేశారు.


## డెహ్రాడూన్ పర్యటనలో పద్మారావుకు గుండెపోటు



- స్టంట్ వేసిన డాక్టర్లు.. ప్రమాదం లేదని ప్రకటన

02

## నర్సు తిట్టిందని..



- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య
- మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో ఘటన

04

నగర మేయర్ విజయలక్ష్మిపై

## అవిశ్వాస తీర్మానం

బీఆర్‌ఎస్ పార్టీ కీలక నిర్ణయం



02



## రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌పై చేయిచేసుకున్న ఎంపీ ఈటల

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేయి చేసుకోవడం సంచలనంగా మారింది. జిల్లాలోని పోచారం మున్సిపాలిటీ ఏకశిల నగర్‌లో ఎంపీ పర్యటించారు. ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ పేదల భూములు కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో పేదల భూములు కబ్జా చేయడంతో ఆగ్రహించిన రాజేందర్ స్థిరాస్తి వ్యాపారిపై దాడి చేశాడు. ఇదే సమయంలో ఎంపీ అనుచరులు, బాధితులు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడికి పాల్పడ్డారు. కాగా, రద్దయిన ఏకశిల వెంచర్‌లో రియల్ బ్రోకర్స్ అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ ఈటల బ్రోకర్లపై చేయి చేసుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

- మేడ్చల్ మల్కాజిగిరి



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

2 బుధవారం 22 జనవరి 2025

# దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట



మొదటి పేజీ తరువాయి

మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని రేవంత్ బృందం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

## డెహ్రాడూన్‌లో పద్మారావుకు గుండెపోటు

**హైదరాబాద్, జనవరి 21:** డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ సీనియర్ నేత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు వైద్యులు చికిత్స చేసి స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఎలాంటి ప్రాణప్రాయం లేదని డాక్టర్లు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన హైద్రాబాద్‌కు రానున్నారు. తమ అభిమాన నేతకు గుండె పోటు వచ్చిందని తెలియడంతో పద్మారావు గౌడ్ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురి అయ్యారు. పద్మారావు గౌడ్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండె పోటుకు గురయ్యారని తెలియడంతో బీఆర్ఎస్ నేతలు ఆయన ఇంటికి తరలి వెళ్తున్నారు. పద్మారావు గౌడ్ హెల్త్ కండిషన్?పై బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్

**అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స**

**పోలీసుల దాడితో బట్టబయలైన వ్యవహారం**



**హైదరాబాద్, జనవరి 21 :** హైదరాబాద్‌లో మరో కిడ్నీ రాకెట్ బట్టబయలు అయ్యింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరుగుతున్న గుట్టును పోలీసులు రట్టు చేశారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ వ్యవహారం కలకలం రేపింది. అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహణ, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు.. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అమాయకులకు డబ్బులు ఆశ చూపి, ఇతర ప్రాంతల నుంచి డాక్టర్లను తీసుకొచ్చి కిడ్నీ మార్పిడి చికిత్సల ద్వారా డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం బయటికి వెలుగు చూడటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పోలీసుల సహకారంతో తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఇద్దరికి కిడ్నీ మార్పిడి చికిత్సలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు కిడ్నీలు ఇవ్వగా.. వాటిని కర్ణాటకకు చెందిన ఇద్దరు రోగులకు అమర్చినట్టు దర్యాప్తులో తేలింది. కిడ్నీ దాతలతో పాటు, ఇద్దరు రోగులను నాలుగు అంబులెన్స్‌లలో పోలీసులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆరు నెలల క్రితమే అలకనంద ఆసుపత్రి ప్రారంభమైందని, ఇద్దరు వైద్యులతో చిన్న.. చిన్న శస్త్ర చికిత్సలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇటీవలే వారికి కిడ్ని మార్పిడి చికిత్స జరగడంతో రోగులు అనారోగ్యానికి గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అలకనంద ఆసుపత్రిని సీజ్ చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రి ఎండీ సుమంత్ చారీ, ఆసుపత్రి సిబ్బందిని అరెస్ట్ చేసినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.

## ప్రజావాణికి మొత్తం 5736 దరఖాస్తులు రాక



**హైదరాబాద్, జనవరి 21:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 5736 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 132, విద్యుత్ శాఖ కు సంబంధించి 131, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 5332 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## నగర మేయర్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం



**ఎమ్మెల్యే తలసాని నివాసంలో కార్పోరేటర్ల భేటీ**

**హాజరైన నగర బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు**

**బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం**

**హైదరాబాద్, జనవరి 21:** బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్‌ఎంసీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో నగర ఎమ్మెల్యేలు దాదాపు 2 గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్‌ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే.. జీహెచ్‌ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 2020, డిసెంబర్‌లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారాహిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. లా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. రోవైపు గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వారి సంఖ్య19కి చేరింది. మరోవైపు ఈ ఏడాది చివరల్లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్, బీజేపీలు సరి సమానంగా ఎంపీ స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు సైతం దక్కలేదు. అలాగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సైతం మేయర్ పీఠం హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిలతో సిద్ధమవుతోన్నారు.

## గణతంత్ర వేడుకల కోసం ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్

**న్యూఢిల్లీ, జనవరి 21:** భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు దేశ రాజధాని ఢిల్లీలో ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ రిహార్సల్స్ జరుగుతున్నాయి. వాయుసేనకు చెందిన యుద్ధ విమానాలు, హెలిక్యాప్టర్‌లు, విమానాలతో ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది చేస్తున్న విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ప్రతి ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు ముందు ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అదేవిధంగా ప్రతి ఏడాది ఒక విదేశీ అధినేతను భారత రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించడం కూడా ఆనవాయితీగా కొనసాగుతున్నది. కరోనా సమయంలో రెండేళ్లు తప్ప ఈ ఆనవాయితీకి ఎప్పుడూ బ్రేక్ పడలేదు. ఈసారి గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో చీఫ్ గెస్టుగా వస్తున్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముందు కర్తవ్యపథ్‌లో నిర్వహిస్తున్న ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్‌కు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

## ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

**పక్కాగా తెలంగాణ భూ భారతి అమలు**

**అధికారులతో సమీక్షలో సిఎస్ శాంతికుమారి**

**హైదరాబాద్, జనవరి 21 :** తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టంలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని సిఎస్ శాంతికుమారి అన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025పై మంగళవారం సచివాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 వివరించేందుకే ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూ భారతి చట్టం, 2025పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించడంతో పాటు జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని అన్నారు. ఈ చట్టం సమర్ధవంత మైన వ్యవసాయ భూ పరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుండి వచ్చిన పలు సూచనలను స్వీకరించిన తరువాతే ఈ చట్టంను రూపొందించామని ఆయన తెలియజేశారు. శాసనసభ ఆమోదం పొందిన ఈ చట్టాన్ని గౌరవనీయులైన గవర్నర్ కూడా ఆమోదించడంతో ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడిందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025 ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు. సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, రాష్ట్ర వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయ-ంమైన,సరసమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం ఈ విధానం లక్ష్యం అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేష్ కుమార్, యోగితా రాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్, ఇతర అధికారులు వర్క్ షాప్‌కు హాజరయ్యారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

- కమిషన్ ముందు హాజరైన ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు
- రుణాలు, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపుపై ప్రశ్నలు
- సుదీర్ఘంగా విచారించిన జస్టిస్ ఘోష్ కమిషన్

**హైదరాబాద్, జనవరి 21:** కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ సుదీర్ఘంగా కొనసాగింది. సంక్రాంతి సెలవుల తర్వాత తిరిగి మంగళవారం నుంచి కమిషన్ విచారణను ప్రారంభించింది. దాదాపు గంటన్నర పాటు రామకృష్ణారావును కమిషన్ విచారించింది. దాదాపు 24 ప్రశ్నలను రామకృష్ణను కమిషన్ చైర్మన్ పిసి ఘోష్ అడిగారు. రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ఆయనను ముందు ప్రశ్నలు ఉంచారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, లోన్స్, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపు, వడ్డీల చెల్లింపులపై వంటి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్‌లు, బ్జడెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.కార్పొరేషన్‌కు నిధులు ఎలా వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. బడ్జెట్ కేటాయింపులు, లోన్స్ ద్వారా నిధులు సమకూర్చినట్లు రామకృష్ణారావు సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారన్న కమిషన్ ప్రశ్నకు.. పరిశ్రమలకు, ఇతర అవసరాలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేట్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని రామకృష్ణ చెప్పినట్లు సమాచారం. డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా అని రామకృష్ణను కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. డిజైన్లను అప్రూవల్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీతో ఎప్పుడూ సమావేశం కాలేదని, కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు రామకృష్ణారావు చెప్పారు. ప్రాజెక్ట్ తొందరగా కట్టారు కానీ నిబంధనలు పాటించలేదని కమిషన్ అడిగింది. అలాగే అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు పాలసీస్ పెట్టారా అని కమిషన్ ప్రశ్నించగా.. దానికి రామకృష్ణారావు తెలియదని సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టుకు సంబంధించిన్గ ÷ల్స్ ప్రాపర్‌గా కేబినెట్ ముందుకు రాలేదని.. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదని కమిషన్ అడిగింది. నిబంధనలు పాటించకుండా విడుదల చేసిన నిధుల రికార్డులను రామకృష్ణారావుకు కమిషన్ చూపించింది. ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులను సరిగా మెయింటెయిన్ చేయలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గ్యారెంటీతోనే కార్పొరేషన్ లోన్స్ తీసుకుందని రామకృష్ణ తెలిపారు. 2024- 25గ ÷నాన్షియల్ ఇయర్లో రూ.7382 ప్రిన్సిపల్ అమౌంట్‌కు రూ.6519 కోట్ల వడ్డీ చెల్లించామని ఆయన వెల్లడించారు. 9 నుంచి 10.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని కమిషన్‌కు రామకృష్ణా రావు తెలిపారు. కాగా.. గతంలోనే ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు, ఇంజనీర్లతో అఫిడవిట్‌లను తీసుకుంది కమిషన్. ఆ అఫిడవిట్‌లను ముందు పెట్టుకునే కమిషన్ బహిరంగ విచారణ చేస్తోంది. గత జూలైలోనే విచారణకు రావాల్సిందిగా రామకృష్ణారావుకు కమిషన్ నోటీసులు ఇచ్చింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం
22 జనవరి 2025


# పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

- ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం
- ఇలాంటి వారుని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్, జనవరి 21:** పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ది జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చాం.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ఎవరు అధైర్యపడవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి అని, కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారికి కాంగ్రెస్ క్యాడర్ అండగా నిలబడాలన్నారు.

# పోలీస్ పహారా మధ్య గ్రామసభలు



- ప్రజా వ్యతిరేకతకు ఇదే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, జనవరి 21:** ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు. మీ రాక్షస పాలనలో విసిగి, వేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళు తెరవండని హితవు పలికారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ గుండాల రాజ్యం

### సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపాటు

**సూర్యాపేట,జనవరి 21 :** నల్లగొండ జిల్లాలో పోలీస్, కాంగ్రెస్ గుండాల రాజ్యం నడుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సహా పార్టీ శ్రేణుల అరెస్ట్ పై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంత్రి వెంకట్ రెడ్డికి కేటీఆర్ ఫోబియా పట్టుకుంది. కేటీఆర్ ఫొటోచూసినా గులాబీ రంగు చూసినా వెంకట్ రెడ్డికి భయమవుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలను వదిలి కావాలనే మున్సిపాలిటీ అధికారులు బీఆర్ఎస్ ఫ్లెక్సీలు చించేశారు. మంత్రి వెంకట్ రెడ్డి సోయిలో లేకుండా ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ÷ంకట్ రెడ్డి మాటలు విని డ్యూటీ చేస్తే అధికారులు ఇబ్బందులు పడుతారన్నారు. పోలీస్ రాజ్యం అమలు చేస్తే చూస్తూ ఊరుకోం. పాలన ఇలానే కొనసాగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మంత్రి స్వయంగా ఫోన్ చేసి మాపై కార్యకర్తలను ఉసిగొల్పుతున్నాడు. మున్సిపాలిటీ లో కాంగ్రెస్ నాయకులకు ఏం పని అని ప్రశ్నించారు. చిల్లర దాడులు మమ్మల్ని ఆపలేవన్నారు. కాంగ్రెస్ పాపాల పుట్ట పలుగుతుంది. కాంగ్రెస్ రహిత తెలంగాణా కోసం నల్లగొండ నుంచే ఉద్యమం మొదలవుతుందన్నారు. కాంగ్రెస్ హఠావో తెలంగాణా బచావో నినాదం మొదలైంది. గుర్తుపెట్టుకోండి ..ఇప్పటికైనా మారకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదన్నారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడుతుంది. రెండు సార్లు ప్రజల దరఖాస్తులు తీసుకుని బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాల పై ప్రజల తిరుగుబడటం ఖాయమన్నారు.



# శాసనసభల గౌరవం పెంచేలా చూడాలి

## అవసరమైతే ప్రవర్తనా నియమావళి నిర్దేశించాలి

### లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు



**పాట్నా,జనవరి 21:** శాసనసభల గౌరవం పరిరక్షణ నిమిత్తం రాజకీయ పార్టీలు తమ శాసనకర్తలకు ఒక ప్రవర్తన నియమావళిని నిర్దేశించాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు ఇచ్చారు. పాట్నాలో 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌లో మంగళవారం ఓమ్ బిర్లా ప్రసంగిస్తూ, రెండు రోజుల సంప్రదింపుల అనంతరం చర్చకు ప్రధాన కేంద్రంగా శాసనసభలను చేయాలని సభాపతులు తీర్మానించారని తెలియజేశారు. 'శాసనసభల గౌరవం పరిరక్షణలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి. రాజకీయ పార్టీలు తమ శాసనకర్తల కోసం ప్రవర్తన నియమావళిని రూపొందించినపప్పుడే ఇది సాధ్యం అవుతుంది' అని బిర్లా స్పష్టం చేశారు. పలు శాసనసభలలో పదే పదే అంతరాయాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ వినియోగం ద్వారా శాసనసభల పని తీరులో మరింత సామర్థ్యాన్ని తీసుకురావలని కూడా సభాపతులు తీర్మానించినట్లు లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. 1947 నుంచి ఇప్పటి వరకు జరిగిన పార్లమెంటరీ చర్చలను రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషల్లో పార్లమెంట్ త్వరలో అందుబాటులోకి తీసుకురాగలదని బిర్లా ప్రకటించారు. శాసనసభలు కూడా 1947 నుంచి జరిగిన చర్చలను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందు కోసం పార్లమెంటరీ సెక్రటేరియల్ నుంచి సాంకేతిక సహాయం అందజేయగలమని ఆయన హామీ ఇచ్చారు. అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌క బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ శాసన మండలి చైర్మన్ అవధేశ్ నారాయణ్ సింగ్ ప్రభృతులు హాజరయ్యారు.

# కాంగ్రెస్‌ది వంచన రాజ్యం

## రైతుల శాపనార్థాలతో ప్రభుత్వం కూలుతుంది

### ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, జనవరి 21:** ఇది రైతు రాజ్యం కాదని, రైతు వంచన రాజ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని మండిపడ్డారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్లలా ప్రాణంతీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలే అని అన్నారు. రుణమాఫీ చేయనందుకే ఈ ఆత్మహత్యలని అన్నారు. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయని చెప్పారు. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయని ఎక్స్ వేదికగా కేటీఆర్ నిప్పులు చెరిగారు.




రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధానమైన కారణాలతోపాటు రాష్ట్రంలో ఏడాది నుంచి వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటుందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఆందోళనకర పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని దాటకపోవడం, రైతన్నలకు కొన్ని సంవత్సరాలుగా అందుతున్న రైతుబంధును ఆపి, ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసాను కూడా ఎత్తగొట్టడం వంటి ప్రధానమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించే విషయంలో సరారు పూర్తిగా చేతులెత్తేయడంతోనే రైతులు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దికులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరఫున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

# రాహుల్, ప్రియాంక శక్తి స్వరూపులు

## ఒకరు యువశక్తి....మరొకరు మహిళా శక్తి

### కీర్తించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**బెంగళూరు,జనవరి 21:** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీలను ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శక్తి స్వూరుపులగా కొనియాడారు. ప్రియాంక 'స్త్రీ శక్తి'కి, రాహుల్ గాంధీ 'యువ శక్తి'కి చిహ్నాలుగా పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావిలో నిర్వహించిన 'గాంధీ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఖర్గే ప్రసంగించారు. 'స్వాతంత్య్ర పోరాటయోధులు కిత్తూరు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మి బాయ్‌తో ప్రియాంకను ప్రజలు పోల్చుకుంటున్నారు. ప్రియాంక స్త్రీ శక్తికి చిహ్నం. ఆమె ఎంతో దృఢమైన మహిళ. తన తండ్రి రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఆమె తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు. బెళగావి బిడ్డ కిత్తూరు రాణి చెన్నమ్మ గొప్ప మహిళ. ఆమె ప్రజల కోసం ఎంతో పోరాటం చేశారు. ప్రస్తుతం భాజపా, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రియాంక పోరాడుతున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. 'ప్రియాంక స్త్రీ శక్తికి.. రాహుల్ గాంధీ యువశక్తికి చిహ్నం. మేమంతా ప్రజల వెంటే ఉంటాం' అని అన్నారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు చేశారు. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గాంధీ కుటుంబమే లక్ష్యంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# మున్నూరు కాపు క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజానావ, బెజ్జంకి:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీం నగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం మండల కేంద్ర మైన బెజ్జంకిలో మున్నూరు కాపు సోదరులు మున్నూరు కాపు డెవలప్మెంట్ ఫోరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఏసీ ఫంక్షన్ హాల్ దుకాణ సముదాయం సహకార పరపతి సంఘం భావన ప్రారంభం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని మున్నూరు కాపు సోదరులు మర్యాదపూర్వకంగా కలిశారు ఇందులో భాగంగా మున్నూరు కాపు డెవలప్మెంట్ రూపొందించి, ప్రచురించిన క్యాలెండర్ ని ఆవిష్కరించాలని కోరగా కేంద్రం మంత్రి వెంటనే స్పందించి మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ సమక్షంలో క్యాలెండర్ ఆవిష్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సాన వేణు పటేల్, గాజే స్వామి పటేల్, తిరుపతి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.




# జీహెచ్ఎంసీ కబ్జా స్థలం స్వాధీనం

**ప్రజానావ, ఖైరతాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో కబ్జాకు గురైన 1,260 చదరపు గజాల స్థలాన్ని జీహెచ్ఎంసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ సొసైటీ లే అవుట్ లో పోలీస్ స్టేషన్ వెనుక జీహెచ్ఎంసీకి చెందిన 1,260 చదరపు గజాల స్థలం కబ్జాకు గురైనట్లు తెలుసుకున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి సోమవారం స్వయంగా వెళ్లి పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ముగ్గురు వ్యక్తులు కలిసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. చర్యలు చేపట్టిన అధికారులు మంగళవారం జేసీబీ సహాయంతో దగ్గరుండి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఈ ల్యాండ్ ను అక్కడ ఉన్నవాళ్లు సర్వీస్ రోడ్డు మాదిరి ఉపయోగించుకుంటున్నారు. వరదలు వచ్చినప్పుడు లే అవుట్ లోని వాళ్లు మెయిన్ రోడ్లపై నడిచే పరిస్థితి ఉండదు. అలాంటప్పుడు ఈ ల్యాండ్ పై నుంచే రాకపోకలు కొనసాగించేవాళ్లు. అయితే, ఈ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించినట్టుగా మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి వచ్చింది. దీంతో ఆమె సోమవారం ఉదయం జీహెచ్ఎంసీ అధికారులతో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ముగ్గురిలో ఒక వ్యక్తి కూరగాయలు, పండ్ల చెట్లు నాటగా.. మరొకరు గార్డెన్ ఏర్పాటు చేసి కాంపౌండ్ వాల్ కట్టుకున్నాడు. ఇంకొకరు ఏకంగా ఓ గదినే నిర్మించినట్లు మేయర్ గుర్తించారు. జీహెచ్ఎంసీ బోర్డును కూడా తొలగించారు. కూరగాయలు పండిస్తున్న వ్యక్తి ఫ్లాట్.. ఈ ఖాళీ స్థలం పక్కనే ఉంది. ఇక్కడ కూరగాయలు పండించేందుకు తన సరిహద్దులో పెద్ద కాంపౌండ్ వాల్ నిర్మించుకున్నాడు. అక్కడ నిచ్చెన వేసుకుని పార్క్ లోకి దిగి కూరగాయలు పండిస్తున్నాడు. కబ్జాకు గురైన స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను మేయర్ అక్కడే ఆదేశించారు. సాయంత్రం అధికారులు జేసీబీతో కాంపౌండ్ వాల్ తొలగించారు. మంగళవారం రూమ్ నీ కూల్చేసి మొత్తం స్థలాన్ని స్వాధీనం చేసుకోనున్నారు. అయితే.. కబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు.



# ప్రొటోకాల్ తెలియాదా?

## సీఎం ఫొటో లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ఎలా చేస్తారు

## ఎమ్మెల్యేపై రహమత్‌నగర్‌కార్పొరేటర్‌సీఎన్‌రెడ్డి ఫైర్


**ప్రజానావ, ఖైరతాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి ఫొటో లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే ఎలా చేస్తారని రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా పాలనలో ఎల్‌వోసీ, సీఎంఆర్‌ఎఫ్‌చెక్కుల పంపిణీ కార్యక్రమ బ్యానర్లలో సీఎం, ఇన్‌చార్జి మినిస్టర్ ఫొటో లేకపోవడంపై ప్రశ్నించారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సంబంధించినటువంటి లబ్ధిదారుల బెనిఫిషరీ ఫాంలో ఎమ్మెల్యే సంతకాలు చేయకుండా కాలయాపన చేయడం, మంజూరైన చెక్కులను పంచకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదని, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎమ్మార్వో కార్యాలయంలో దాదాపు వందలాది షాదీముబాకర్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయకపోవడంతో ల్యాప్స్‌అయ్యాయని మండిపడ్డారు. పేద ప్రజలకు సంబంధించిన విషయంలో మరొకసారి నిర్లక్ష్యం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

# కాళేశ్వరం ఆలయంలో అపచారం

- పెద్దపెద్ద కెమెరాలతో ఓ ప్రైవేటు ఆల్బమ్ షూట్



**కాళేశ్వరం, జనవరి 21:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో అపచారం జరిగింది. సాధారణంగా ఆలయంలో సెల్‌ఫోన్‌తోనే ఫొటోలు, వీడియోలు చిత్రీకరించనివ్వరు. అలాంటిది ప్రముఖ పుణ్యక్షేత్రంలో పెద్దపెద్ద కెమెరాలతో ఓ ప్రైవేటు ఆల్బమ్‌ను షూట్ చేశారు. గుడి తలుపులు మూసేసి మరీ గర్భగుడిలో ప్రైవేటు ఆల్బమ్‌ను చిత్రీకరించారు. ఇందుకోసం దర్శనానికి వచ్చిన భక్తులను సైతం బయటే నిలిపివేయడం గమనార్హం. ఈ ఘటనపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులను నిలిపివేసి మరి ఆలయ గర్భగుడిలో ఓ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరిస్తున్నప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. ఆలయ పవిత్రతను అధికారులు దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ ఆలయం ఉంది. త్రిలింగాల్లో ఇది ఒక ప్రదేశం (ద్రాక్షారామం, శ్రీశైలం). కాళేశ్వరాలయానికి ముక్తేశ్వరాలయం అని పేరు. ఈ ఆలయంలో ఒకే వేదికపై రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడినవి. ఒక శివలింగానికి కాళేశ్వరుడు, రెండో లింగానికి ముక్తేశ్వరుడు అని పేర్లు ఉన్నాయి. ఈ ఆలయానికి పిరమిడ్ ఆకారంలో శిఖరం నిర్మించబడి ఉంది (అది ప్రస్తుతం లేదు). ఈ ఆలయానికి ఉత్తరంగా మరొక చిన్న గుడి ఉండేది. అందులో అన్నపూర్ణ దేవి ప్రతిమ ఉండేది. ఇప్పటికీ ఈ ఆలయంలో గణపతి, మత్స్యావతారం, చతుర్ముఖలింగం, సూర్య, విష్ణు, నంది మొదలైన విగ్రహాలు ఉన్నాయి. తెలంగాణలో ప్రసిద్ధక్షేత్రంగా అభివృద్ధి చెందిన దేవాలయం ఇది. కాబట్టి విద్యానాథుడు దీన్ని త్రిలింగ దేశానికి ఒక సరిహద్దుగా కీర్తించాడు.



# నర్సు తిట్టిందని..

## మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

## మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో ఘటన

**మహబూబ్‌నగర్, జనవరి 21:** వైద్యం కోసం వెళ్లిన ఓ మహిళపై ఓ నర్సు దాష్టీకం ప్రదర్శించింది. ఇష్టమొచ్చినట్లు తిడుతూ చేయి కూడా చేసుకుంది. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపం చెందిన సదరు మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. దామరగిద్ద మండలం కందేన్‌పల్లికి చెందిన నారమ్మ(32) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. అయితే రాత్రి సమయంలో విధుల్లో ఉన్న ఓ నర్సు నారమ్మపై దౌర్జన్యం ప్రదర్శించింది. ఆమెను ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా చేయి కూడా చేసుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి అని బాత్‌రూంలోకి వెళ్లింది. కానీ ఎంతసేపటికీ బయటకు రావడంతో బంధువులు తలుపులు బద్దలగొట్టి చూడగా ఉరేసుకుని నారమ్మ కనిపించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నర్సు దుర్భాషలాడుతూ చేయి చేసుకుందనే మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

# తెలంగాణకు చెందిన ఓ ట్రస్టుకు నోటీసులు

**గోపేశ్వర్, జనవరి 21:** ఉత్తరాఖండ్‌కు చెందిన బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ తెలంగాణకు చెందిన ఓ ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు చెందిన నమూనాలను తెలంగాణలో నిర్మించేందుకు ఓ ట్రస్టు ప్లాన్ చేసింది. హిమాలయాల్లోని ఆ గుళ్ల నమూనాలను పునర్ సృష్టించవద్దు అని కమిటీ తన నోటీసులో పేర్కొన్నది. సోమవారమే ఆ నోటీసులు జారీ అయ్యాయి. ఆలయ కమిటీకి చెందిన మీడియా ఆఫీసర్ హరీశ్ గౌర్ ఆ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఆలయ కమిటీ ప్యానల్‌లోని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్ ప్రసాద్ తప్లియాల్ దానిపై సంతకం చేశారు. హిమాలయ పర్వతాల్లోని బద్రీనాథ్, కేదార్‌నాథ్ క్షేత్రాలను భక్తులు కొన్ని శతాబ్ధాల నుంచి విజిట్ చేస్తున్నారని, అయితే ఆ ఆలయాలకు చెందిన నమూనాలను రీక్రియేట్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కమిటీ తన నోటీసులో తెలిపింది. రెండు వారాల్లోగా తమ నోటీసులకు స్పందించాలని బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ కోరింది. ఒకవేళ స్పందన లేని పక్షంలో.. సివిల్, క్రిమినల్ చర్యలు ఉంటాయని ఆలయ కమిటీ తన నోటీసులో పేర్కొన్నది.



# తొలి 8 రోజుల్లోనే పాల్గొన్న 8.81 కోట్ల మంది భక్తులు

## కుంభమేళాలో పాల్గొన్న గౌతమ్ అదానీ

**ఉత్తరప్రదేశ్, జనవరి 21:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో కన్నుల పండువగా మహా కుంభమేళా జరుగుతున్నది. రోజుకు కోటి మందికిపైగా భక్తులు ఈ మహా కుంభమేళాకు తరలివస్తున్నారు. తొలి 8 రోజుల్లోనే 8.81 కోట్ల మంది భక్తులు మహా కుంభమేళాలో పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తాజాగా అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మహా కుంభమేళాకు వెళ్లారు. అక్కడ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహా కుంభమేళాలో ఇస్కాన్ టెంపుల్ వాళ్లు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ క్యాంపులో అదానీ తన సేవలు అందించారు. ప్రసాదం తయారీలో ఆయనలో పాల్గొన్నారు. ఇస్కాన్ టెంపుల్ వారితో కలిసి ఆయన ఈ సేవ చేశారు. కుంభమేళా జరిగినన్ని రోజులు అంటే జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు కూడా తమ క్యాంపులో ప్రసాద వితరణ జరుగుతుందని ఇస్కాన్ టెంపుల్ వారు తెలిపారు. గౌతమ్ అదానీ ప్రసాద తయారీ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు..

# వచ్చేనెలలో 5న కుంభమేళాకు ప్రధాని మోదీ



**ఉత్తరప్రదేశ్, జనవరి 21:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ మహాకుంభమేళాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నట్లు తెలిసింది. వచ్చే నెల అంటే ఫిబ్రవరి 5వ తేదీన ప్రధాని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ సైతం మహాకుంభ్‌ను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది. ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ముర్మ మహాకుంభమేళాకు వెళ్లనున్నట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఈనెల 27న మహాకుంభమేళాకు హాజరుకానున్నట్లు తెలిసింది. త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించి గంగాపూజ నిర్వహించనున్నారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఇక ఫిబ్రవరి 1వ తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ సైతం ప్రయాగ్‌రాజ్ వెళ్లనున్నారు. ప్రముఖుల పర్యటన నేపథ్యంలో అధికారులు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. కీలక కూడళ్లు, కార్యక్రమాల వేదికలపై నిఘా పెంచారు.

# ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

- ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి
- ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.
- చలపతి సహా పలువురు అగ్రనేతలను మట్టుబెట్టిన బలగాలు
- నక్సల్స్ లేని భారత్ దిశగా అడుగులు అంటూ అమిత్‌షా



**రాయపూర్, జనవరి 21 :** ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ప్రధాన మావోయిస్టులు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. చిత్తూరు జిల్లావాసి అయిన చలపతిపై ప్రభుత్వం గతంలో రూ.కోటి రివార్డు ప్రకటించింది. దీంతో జనవరి 19 రాత్రి నుంచి పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 27కు చేరిందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సోమవారం ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. మంగళవారం తెల్లవారుజామున జరిపిన గాలింపులో మరో 20 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే భారీస్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇందులో వెయ్యి మంది వరకు భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ ఎన్ కౌంటర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని ఆయన తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బలాంటిదన్నారు. మన భద్రతా బలగాలకు ఇదో గొప్ప విజయం అని అమిత్ షా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో నక్సలిజం చివరి దశలో ఉందని ఎద్దేవా చేశారు. సీఆర్‌పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని షా చెప్పారు. అయితే, ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్ర త్యేక ఆపరేషన్ కొనసాగుతుంది. ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 16 మంది మావోలు మరణించగా.. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారని అమిత్ షా పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న బలగాలపై ప్ర శంసలు జల్లు కురుపించారు. మన భద్రతాదళాలకు ఇది గొప్ప విజయమని, నక్సల్స్ రహిత భారత్ దిశగా ఇది కీలక అడుగు అని కొనియాడారు. ఈ ఎన్ కౌంటర్ కేంద్ర కమిటీ సభ్యులు మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డూ, ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు.

## ఆర్ పి ఎఫ్ జిల్లా అధ్యక్షునిగా కుమారస్వామి

**పెద్ద పల్లి జిల్లాప్రతినిధి, జనవరి21(ప్రజానావ):**

రాయల్ పీపుల్స్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షునిగా, తెలంగాణ రాష్ట్ర జేఏసీ సభ్యునిగా రేండ్ల కుమారస్వామి పటేల్ ను నియామించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమలశెట్టి రెడ్డి శేఖర్ తెలిపారు. ఈమేరకు నియామక పత్రం అందజేశారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన చెందిన రేండ్ల కుమారస్వామి పటేల్ ను దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని బలిజ, కాపు, తెలగ, ఒంటరి రైతుల సమస్యల పరిష్కారానికి, వారి వ్యాపార అభివృద్ధికి, యువత ఉపాధి అవకాశాలకు, వారి ఐక్యతకు పనిచేస్తున్న ఆర్ పి ఎఫ్ తెలంగాణలోని మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలని ఆయనకు సూచించారు. తన నియామకానికి సహకరించిన రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమలశెట్టి రెడ్డి శేఖర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ తెలంగాణలోని మున్నూరు కాపులను రాజకీయంగా చైతన్యపరచడానికి ఈ సంస్థ పనిచేస్తుందని, సమాజంలోని పలువురి సహకారంతో రాజకీయ సేవలో ఉన్నవారిని ప్రోత్సహిస్తున్న ఈ సంస్థ ద్వారా సంస్థ నియమ నిబంధనలకు లోబడి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.



# ఎన్నికలప్పుడే విమర్శలు..తర్వాత అభివృద్ధి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- రైతులకు సేవలు అందించడమే సహకార సంఘాల ధ్యేయం
- ఎమ్మెల్యే డా కవ్వంపల్లి సత్యనారాయణ



**(ప్రజానావ బెజ్జంకి)**

బెజ్జంకి మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు తన్నీరు శరత్ రావు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంఘ కార్యాలయం, బంకేట్ హాల్,షాపింగ్ కాంప్లెక్స్ ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి ప్రారంభించారు.కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ మాట్లాడుతూ నాబార్డు కేంద్ర ప్రభుత్వ నిధులతో 3 కోట్లతో నిర్మించారని,గ్రామ పంచాయితీల కు కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వ నిధులతో నిర్మాణాల చేపడుతున్నారని,తాజమాజి సర్పంచ్లు లకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని,గన్నేరువరం నుండి మానేరు వరకు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని,నాయకుల మధ్య కొట్లాలు ఉండవని,ఎన్నికల్లో మాత్రమే విమర్శలు ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే దృష్టి అని,కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అన్ని పార్టీ వాళ్ళు కలిసే ఉండి, ప్రజా సమస్యలపై ఒక అలోచన ఉంటుందని,అభివృద్ధి కూడా ఆ స్థాయిలో జరుగుతుందని,రైతులు తమ లోన్లు కడితే కొత్త వారికి అవకాశం దొరుకుతుందని,గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో ఈ ఏసీ ఫంక్షన్ హాల్ కట్టడం సంతోషకరమని,రైతులకు ఏ ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం మానకొండూరు శాసన సభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను కంటికి రెప్పలా కాపాడుతుండదని,సహకార సంఘాలు రైతులకు సేవలు అందించాలని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాల అమలులో రుణమాఫీ, రైతు భరోసా పథకాలను రైతులకు చేర్చటంలో సహకార బ్యాంకు లు ముందు ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద రావు,డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,ఏఎంసి చైర్మన్ పులి క్రిష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి,మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, కేడిసిసి డైరెక్టర్ అలువాల కోటి,మాజీ ఆప్కాబ్ చైర్మన్ దేవిశెట్టి శ్రీనివాస్ రావు,ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్,తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఇంచార్జి ఎంపిడిఓ అంజయ్య, ప్యాక్స్ డైరెక్టర్ లు దీటి బాల నర్సు,అన్నాడి శ్రీనివాస్ రెడ్డి,బెజ్జంకి నరేష్ బాబు,కట్ట బాలవ్వ,కరివేద సరోజన, మచ్చ రాజేశం,సీత భూమయ్య,అన్నాడి రవీందర్ రెడ్డి,ఎలుకంటి తిరుపతి రెడ్డి, గూడెల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌పీఈ(1535) రీజినల్ కమిటీ ఎన్నిక

**ప్రజానావ, కరీంనగర్, జనవరి 20:**

సెంట్రల్‌ప్రెసిడెంట్‌ఎంఏ వజీర్, టీఎస్ ట్రాన్స్‌కో ప్రెసిడెంట్ కే. శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ గెస్ట్‌జమీరుద్దీన్‌ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 సర్వసభ్య సమావేశంలో రీజినల్‌కమిటీని ఎన్నుకున్నారు. కరీంనగర్‌రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా జీ సురేందర్‌ప్రసాద్, రీజినల్‌అధ్యక్షుడిగా ఠాకూర్‌చందర్‌సింగ్, రీజినల్‌సెక్రటరీగా ఎండీ జియాని నియమించారు. నూతనంగా ఎన్నికై వారిని జమీరుద్దీన్, ఇతర ఉద్యోగులు, సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి నూతనంగా ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.







## నేడు పెద్ద పల్లిలో మందకృష్ణ సదస్సు



**పెద్ద పల్లి జిల్లాప్రతినిధి, జనవరి21(ప్రజానావ):**

పెద్దపల్లిలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్, కరీంనగర్ జిల్లా ఇంఛార్జి రామంచ భరత్ పిలుపునిచ్చారు. పెద్ద పల్లి ప్రెస్ క్లబ్ లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 22 న ఉదయం 10 గంటలకు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. లక్ష డప్పులతో నిర్వహించే సన్నాహక సమావేశానికి జిల్లాలోని ప్రతి గ్రామం నుండి డప్పులతో మాదిగలు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, మాదిగ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, విద్యార్థులు, ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రుద్రారం రాంచందర్, నాయకులు మంథని చందు, ఆంబాల రాజేందర్, మామిడిపల్లి బాపయ్య, పెద్దపల్లి ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి అంబాల నరేష్, పులిపాక బానేశ్, కాదాసి చంద్రమౌళి, ఎర్రోళ్ల ఆదిత్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**ప్రజానావ, హుస్నాబాద్ :**

జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు భాగంగా ఈరోజు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డిపో కు ప్రత్యేక అతిథిగా హుస్నాబాద్ పట్టణ ఎస్ఐ మహేష్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న డ్రైవర్లు అందరూ కూడా ముందు వస్తున్నటువంటి వాహనదారులను జాగ్రత్తగా గమనిస్తూ బస్సు నడపాలని, మరియు సెల్ఫోన్ డ్రైవింగ్ పూర్తిగా నిషేధించాలని, మన యొక్క బస్సును డిఫెన్స్ చేస్తూ నడపాలని సూచించారు. అలాగే డిపో మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ విధి నిర్వహణలో జాగ్రత్తగా బస్సులు నడుపుతూ ప్రజలకు మరింత మెరుగైనటువంటి సేవలను అందించాలని, ఈ 2025 సంవత్సరానికి గాను హుస్నాబాద్ డిపోను యాక్సిడెంట్ ఫ్రీ డిపోగా మార్చాలని సూచించడం జరిగింది . అనంతరం యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను సన్మానించడం జరిగింది. నవంబర్ మరియు డిసెంబర్ మాసాలకు గాను ప్రగతి చక్ర అవార్డ్స్ ను మరియు బెస్ట్ ఈ.పి.కే. బెస్ట్ కే. ఎం. పి .ఎల్. తీసుకువచ్చిన కండక్టర్ డ్రైవర్లకు ప్రశంస పత్రాలు మరియు నగదు బహుమతులు అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఏ ఎం ఎఫ్ మరియు ఆఫీస్ సూపర్డెంట్, ట్రాఫిక్ సూపర్వైజర్, సెక్యూరిటీ హెడ్ గార్డ్, గ్యారేజీ సిబ్బంది మరియు డ్రైవర్ కండక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహించాలి



- రేషన్ కార్డు ల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ
- పారదర్శకంగా లబ్ది దారుల గుర్తింపు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లాలో మొదలైన ప్రజా పాలన గ్రామ, వార్డు సభలు

**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డ్ సభలకు ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో మంగళవారం పథకాల కోసం సభలు నిర్వహించారు. తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పరిశీలించారు. అర్హుల గుర్తింపు కోసం చేపట్టిన సభలో కూర్చుని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం జిల్లాలోని ఆయా గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ పరిధిలోని ఆయా వార్డుల్లో అర్హుల గుర్తింపు సభలు నిర్వహిస్తున్నామని వివరించారు. అర్హులందరికీ రాష్ట్ర పథకాలు అందుతాయని వెల్లడించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు అనేవి నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకొని వారు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు కు అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఆయా పథకాలు అర్హులైన వారికి అందుతాయని, ఎంపిక పారదర్శకంగా చేపడుతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ఉదయం 9 గంటలకు మొదలు..**

జిల్లాలోని రుద్రంగి, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట తదితర మండలాల్లో 75 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 4, 5, 6, 8, 9, 16, 17, 18, 19, 28 వార్డ్ ల్లో, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1, 2, 8, 12, 18, 21, 22, 25 వార్డ్ ల్లో మొదటిరోజు గ్రామ, వార్డ్ సభలు నిర్వహించారు. ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంట వరకు అలాగే మధ్యాహ్నం 01.00 గంటల నుంచి 04.00 గంటల దాకా సభలు చేపట్టారు.

## ఓపెన్ కాస్ట్ కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు వినతి



**బెల్లంపల్లి జనవరి 21( ప్రజా నావ )**

శాంతిఖని, శ్రావణ్ పల్లి ఓపెన్ కాస్ట్ వ్యతిరేక జేఏసీ పోరాట కమిటీ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. బెల్లంపల్లి శాంతి ఖని శ్రావణ్ పల్లి ప్రతిపాదిత ఓపెన్ కాస్ట్ సింగరేణి యాజమాన్యం ప్రకటించడం బెల్లంపల్లి పట్టణానికి కాకుండా చుట్టుపక్కల దాదాపు 15 గ్రామాలకు ప్రజల జీవవైవిద్యాన్ని, విధ్వంసాన్ని సృష్టించదలచుకున్నధని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 1954లో ఏర్పడ్డ శాంతిఖని గని మొదలుకొని బెల్లంపల్లి పట్టణంలో అరడజను బొగ్గు బావులను బొగ్గునిక్షేపాలు, ఇంకా మిగిలి ఉండగానే అప్పటి పరిస్థితుల కారణంగా మూసివేసినారు.వేలకోట్ల రూపాయల బొగ్గు నిక్షేపాలు బెల్లంపల్లి పట్టణం కింద నిక్షిప్తమై ఉన్నాయని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మరియు సింగరేణి ఎక్స్ప్లోరేషన్ అన్వేషణ, విభాగం యొక్క నివేదికలు వెల్లడిస్తున్నాయి ఇప్పుడు ఉన్న కరెంటు డిమాండ్ బొగ్గు డిమాండ్ వలన ఈ అపారమైన బొగ్గునిక్షేపాలను వెలికి తీయడానికి, ఒకనాడు ప్రజల ప్రయోజనాలు జాతి ప్రయోజనాల కోసం ఏర్పడ్డ ప్రభుత్వ రంగ పరిశ్రమలు నేడు లాభనష్టాలు బేరిజు, వేసుకుంటూ వ్యాపార దృక్పథంతో ముందు కెళ్తున్న తరుణంలో పాలకవర్గాలు, తీసుకొచ్చిన సంస్కరణ మూలంగా ప్రైవేటీకరణకు, కాంట్రాక్టీకరణకు, కార్పొరేటీకరణకు,గురి చేయబడుతూ ఈ ప్రాంతాన్ని నమ్ముకుని ఉన్నటువంటి ప్రజానీకానికి వారి బిడ్డలకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా చేయడం కోసం బెల్లంపల్లి ఓపెన్ కాస్ట్ తెర మీదకు సింగరేణి యాజమాన్యం తీసుకువచ్చింది. ఓపెన్ కాస్ట్ ల వలన ఎటువంటి ఉపాధి అవకాశాలు రాకపోగా పచ్చని పంట పొలాలు తోటలు వ్యవసాయ భూములు విధ్వంసం జరగడమే కాకుండా తీవ్రమైన పర్యావరణ విఘాతం కలుగుతుంది. భారీ స్థాయిలో విధ్వంసం లేని ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు వచ్చే అండర్ గ్రౌండ్ గనులను ప్రారంభించాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి తద్వారా ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ నాయకులు టి మణిరాం సింగ్, పోరాట కమిటీ కన్వీనర్ గోగర్ల శంకర్, కో కన్వీనర్ జైపాల్ సింగ్ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు టి శ్రీనివాస్, ఏఐఎఫ్టియు సొమ్ము రాజయ్య, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కొమ్ము లక్ష్మణ్, టీబీజీకేఎస్ ధరణి సత్యనారాయణ, కో కన్వీనర్స్ తుంగల శ్రీనివాస్, ఎం వంశీ, జగన్మోహన్ రెడ్డి, ఆర్ సోమేశ్వర్ రావు, టి స్వామి, పి సత్యనారాయణ, రాజన్నరసు, కే ఓదేలు, ఆర్ అశోక్ గౌడ్, జె దేవ రాజ్ సిపిఐ ఎంఎల్ కొలిపాక శ్రీనివాస్ కె కె హే మాజీ బిజెపి జిల్లా అధ్యక్షులు గోవర్ధన్, పులగం తిరుపతి, దాసరి శ్రీని వాస్, బుల్లు మల్లయ్య ఎండి అన్వర్, తుంగల సత్యనారాయణ ,మాజీ జెడ్పిటిసి టిఆర్ఎస్ కె ఓదేలు, గోమాత రాజ్యం, సముద్రాల మురళి, మాజీ కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## వార్డుసభలో ఆందోళన

ప్రజానావ, బెల్లంపల్లి: బెల్లంపల్లి వార్డు సభను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బెల్లంపల్లి 11వ వార్డులో మంగళవారం ప్రజాపాలన వార్డు సభ స్పెషల్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు చైర్ పర్సన్ శ్వేతా శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆర్డిఓ హరికృష్ణతో కలిసి ప్రజా పాలన సభను పరిశీలించారు వార్డు ప్రజల వద్ద నుండి దరఖాస్తులను నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిజమైన లబ్ధిదారులకి ప్రభుత్వ పథకాలు అందుతాయి అన్నారు. అదేవిధంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ 1వ వార్డులో నిర్వహించిన వార్డు సభ రసాభాసగా మారింది. వార్డు సభకు మున్సిపల్ చైర్పర్సన్ జక్కుల శ్వేత, ఆర్డీఓ హరికృష్ణ హాజరయ్యారు.వార్డ్ అధికారి లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించగా అనర్హులను లబ్ధిదారులుగా ప్రకటించారని ప్రజలు మండిపడ్డారు. ఇళ్లు ఉన్నవారికే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. అర్హులందరికీ పథకాలు అందజేస్తామని అధికారులునచ్చచెప్పారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు



## వ్యాపారుల సంఘం అధ్యక్షుడిగా వడ్లకొండ కనకయ్య గౌడ్

**ప్రజానావ, బెల్లంపల్లి :** మందమర్రి పాతబస్టాండ్ లో పద్మశాలి భవన్ లో నిర్వహించిన వ్యాపార సంఘం సభ్యులందరు హాజరై అధ్యక్షుడిగా వడ్లకొండ కనకయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవడం జరిగింది.పాత బస్టాండ్ లో రెండవసారి కనకయ్య గౌడ్ చేసిన అభివృద్ధి పనులు , సేవకార్యక్రమాల వాళ్ళ ఆయనను తిరిగి అధ్యక్షుడుగా ఎన్నుకోవడం జరిగింది. వ్యాపార సంఘం సభ్యులు, మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న వ్యాపార సంఘం సభ్యులకు ఎప్పుడు అండగా ఉంటానని తెలిపారు. వడ్లకొండ కనకయ్య గౌడ్ వ్యాపారస్థులందరికి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో వ్యాపార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# 24న స్మార్ట్ సిటీ పనులు ప్రారంభం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితో కలిసి నగరంలో పర్యటన

ప్రజానావ, కరీంనగర్ :

స్మార్ట్ సిటీ లో అభివృద్ధి చేసిన ప్రాజెక్టు లను ప్రజలకు 24 న అందుబాటులోకి తెస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధి లో భాగంగా మంగళవారం రోజు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్, కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ నగరం లో పర్యటించారు. స్మార్ట్ సిటీ లో అభివృద్ధి చేసి ప్రారంభానికి సిద్ధం చేసిన ప్రాజెక్టు లను సందర్శించి.. ప్రారంభోత్సవాల ఏర్పాట్ల పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ తో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నగరంలోని స్పోర్ట్స్ కమర్షియల్ కాంప్లెక్స్ మొదటగా సందర్శించి పనులను పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి స్మార్ట్ ఈ క్లాస్ రూమ్స్ పరిశీలించి... విద్యార్థులను కలిసి విద్యాభ్యాస వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పట్ట ణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్ట ర్ పర్యటన నేపథ్యంలో సభ స్థలాన్ని పరిశీలించి ... డంపు యార్డును పరిశీంచారు. ప్రారంభోత్సవా ఏర్పాట్లు, సభ ఏర్పాట్ల పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద గృహా నిర్మాణ, పట్ట ణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్ట ర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా మా పాలకవర్గం అంతా కలిసి ప్రారంభోత్సవాలు చేస్తామని తెలిపారు. కరీంనగర్ నగరంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో 24 గంటల మంచి నీటి సరఫరా పాయిలెట్ ప్రాజెక్టు తో పాటు కుమార్ వాడి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, స్మార్ట్ ఈ క్లాస్ రూమ్స్, స్పోర్ట్స్ కమర్షియల్ కాంప్లెక్స్, ప్రజల కోసం అహ్లాదకంగా మార్చిన సుంధరీకరించిన మల్టి పర్పస్ పార్కు ప్రాజెక్టు లను ప్రారంభం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రారంభోత్సవాల ఏర్పాట్ల పై అధికారులకు తగిన సూచనలు చేసి ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. 24 వ తేదీన ప్రారంభోత్సవాల అనంతరం ముఖ్య అతిథులతో హౌజింగ్ బోర్డు కాలనీలో పెద్ద ఎత్తున సభా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ వార్డు సభలో రసభాస

**ప్రజనావ, హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన వార్డు సభలు రసభాసగా మారాయి. పట్ట ణంలోని ఒకటో వార్డులో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులలో పేర్లు రాలేదని కొంతమంది వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఓకే కుటుంబంలో ఇద్దరికీ, స్థానికంగా లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎంతమందికి ఇచ్చారని కాంగ్రెస్ శ్రేణులు నిలదీయడంతో, రాజకీయాలు వద్దని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులలో పేర్లు రానివారు వార్డు సభలో దరఖాస్తు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సద్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అర్హులైన వారి పేర్లను కమిషనర్ చదివి వినిపించారు. సర్వేలో వచ్చిన వారి పేర్లు ఫైనల్ కాదని అందులో కూడా అర్హులను గుర్తించిన తర్వాతే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కమిషనర్ తెలిపారు. అర్హులైన పే దలకే ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు ఇవ్వాలి. ఇందిరమ్మ ఇల్లు కమిటీ లో కాంగ్రెస్ కార్యకర్తలే రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పింది. బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి అన్నారు.



# ప్రజాపాలన సభలను సందర్శించిన కమిషనర్

ప్రజా నావ, కరీంనగర్.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి న ప్రజాపాలన వార్డు సభలను అధికారులు విజయవంతం చేయాలని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సంక్షేమ పథకాల అమలులో భాగంగా 21, 22 తేదీల్లో ప్రజాపాలన వార్డు సభలను నిర్వహించడం జరుగుతుంది. మొదటి రోజు నగరపాలక సంస్థ పరిది లోని 30 డివిజన్లలో వార్డు ఆఫీసర్లు, కార్పోరేటర్ల ఆద్వర్యంలో ప్రజాపాలన వార్డు సభలు జరిగాయి. ప్రధాన సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ బరోస దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఇందులో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ పలు డివిజన్ లలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి రోజు 1 నుండి 30 డివిజన్ లలో ప్రజాపాలన వార్డు సభలను ఏర్పాటు చేశామని తెలిపారు. డివిజన్ వారిగా వార్డు ఆఫీసర్ మరియు ఇంచార్జ్ అదికారుల ద్వారా ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరణ చేశామని తెలిపారు. మొదటి రోజు నగర వ్యాప్తంగా 30 డివిజన్ లలో ప్రజల నుండి సంక్షేమ పథకాలకు సంబంధించి మొత్తం రేషన్ కార్డులకు సంబంధించి 9699, ఇందిరమ్మ ఇండ్లు సంబంధించి 4412 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. రేపు కూడ 31 డివిజన్ నుండి 60 వ డివిజన్ లలో కూడ ప్రజాపాలన వార్డు సభలు కొనసాగుతాయని స్పష్ట ం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, అధికారులు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై అపోహలొద్దు

- ఇందిరమ్మ ఇళ్ల తో పేదల కల సాకారం
- రైతు కళ్ల లో ఆనందం చూసేందుకే రైతు భరోసా
- కొత్త రేషన్ కార్డుల జారీతో ఏళ్ల నాటి నిరీక్షణకు తెర
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలకూ న్యాయం
- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



ప్రజా నావ, బెజ్జంకి :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలపై ఎలాంటి సందేహాలు వద్దని, అర్హులకే పథకాల ద్వారా లబ్ధిచేకూరుస్తామని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్కార్డు ల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సమాయత్త మైందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షలకు పెంపుతోపాటు రైతులకు రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుతో ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. గ్రామసభల్లో వెల్లడించే జాబితాల్లో పేర్లు లేని అర్హులైన నిరుపేదలకు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వారి అర్జీలను పున:పరిశీలించి తగు న్యాయం చేస్తామ న్నారు. ఈ పథకంపై పేదలు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయమన్నారు. అర్హులైన నిరుపేదలకు తప్పకుండా లబ్ధి చేకూరుస్తామని డాక్ట ర్ కవ్వంపల్లి హామీ ఇచ్చారు.

రైతు కళ్లలో ఆనందాన్ని చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అందుకే రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల రూపాయల చొప్పు పెట్టుబడి సాయం అందించనున్నామన్నారు. 26 నుంచి రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ కానున్నాయని ఆయన వెల్లడించారు.

గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా కొత్త రేషన్ కార్డుల పంపిణీతో ఏళ్లనాటి ప్రజల నిరీక్షణకు తెరపడనున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. తాజాగా రేషన్ కార్డుల పంపిణీతోపాటు పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఆయన చెప్పారు.

రైతు కూలీలకు కూడా న్యాయం చేయాలనే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు.

ఈ గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారితో పాటు బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం



- పచ్చునూర్ లో గోదాం నిర్మాణానికి హామీ
- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రజానావ, మానకొండూర్ :

రైతుల సంక్షేమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, అందులో భాగంగా రైతులను ఆదుకోవడానికి రుణమాఫీని అమలు చేశామన్నారు. రుణమాఫీతో లబ్ధిపొందిన వారిలో దేవంపల్లి గ్రామంలో 177 మంది రైతులు ఉన్నారని, వీరిలో లక్ష లోపు రుణమాఫీ పొందిన వారు 18 మంది, లక్షన్నర లోపు రుణమాఫీ పొందిన వారు 74 మంది, రెండు లక్షల రుణమాఫీ పొందిన వారు 85 మంది ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. ప్రతిష్టాత్మంగా అమలు చేయనున్న నాలుగు పథకాల్లో రైతులకు సంబంధించి రైతు భరోసా, రైతు కూలీలకు సంబంధించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు కూడా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

**సహకార వ్యవస్థ బలోపేతానికి సర్కారు చర్యలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సహకార వ్యవస్థను పటిష్టపర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి చెప్పారు. అందులో భాగంగా సహకార సంఘాల భవనాలు, గోదాముల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. శంకుస్థాపన చేసిన ఆరు నెలల వ్యవధిలో సంఘ భవనాలను నిర్మించి ప్రారంభోత్సవాలు చేసుకోవడం ముదావహమని పేర్కొంటూ సంఘ చైర్మన్, డైరెక్ట ర్లు అభినందనలు తెలియజేశారు. దేవంపల్లి సహకార సంఘం పరిధిలోని పచ్చునూరు గ్రామంలో కూడా గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లతా ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ కుమార్, కనుకం అశోక్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోండ్ల సురేశ్, ఇర్ఫాన్, వరాల చారి,టేకుమల్ల అంజయ్య, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య, సహదేవ్, ఆంజనేయులు, ప్రేమ్,శ్యామ్, నరేశ్, రాకేశ్ సొసైటీ పరిధిలో దేవంపల్లి, లలితాపూర్, పచ్చునూరు గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# బదిర విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ

- రూ. 1. 40 లక్షల చెక్కున అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని కుటుంబ సభ్యులు

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల :

బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి తండ్రి పోచయ్య. ఈమె కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఉన్నత విద్యాబ్యాసం చేసేందుకు ఆర్థిక స్తోమత లేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టిలోకి వచ్చింది. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది. మంగళవారం దోమకొండ



లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు దోమకొండ లహరి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అర్హులైన నిరుపేదలకే పథకాలు వర్తింప జేయాలి

ప్రజానావ, హుస్నాబాద్:

ఇందిరమ్మ ఇల్లు కమిటీ లో కాంగ్రెస్ కార్యకర్తల పేర్లే ఉన్నాయని, రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిందని, బీఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి. ఆన్నారు వార్డు సభలో దరఖాస్తులను పరిశీలించడం జరిగింది .కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలపెట్టుకోలేక కాలయాపన కోసమే ప్రయత్నలు చేస్తుంది తప్ప చేసింది ఏమి లేదు గత సంవత్సర కాలం లో ప్రజా పాలన పేరిట నిర్వహించిన గ్రామ సభ లో అనేక మంది పేద ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు సంవత్సరం నుండి రేషన్ కార్డులు ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారు కనీసం పెట్టిన అనేక దరఖాస్తు లు డేటా కూడా ను ఎంట్రీ చేయ లేదు అంటే ప్రభుత్వం పేదల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవరిస్తుంది అనేది కనపడుతుంది రైతులకు భరోసా కింద ఇచ్చే



సహాయం పదిహేను వేలు తగ్గించి పన్నెండు వేలకు సరిపెట్టినారు అందులో కొతలు పెట్టినారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది అని కనబడుతుంది ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చవరకు ప్రభుత్వన్ని బి ఆర్ యస్ పార్టీ వదిలిపెట్టే ది లేదు ఈ కార్యక్రమం లో బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి బి ఆర్ యస్ పార్టీ నాయకులు మునిసిపల్ కౌన్సిలర్ పెరుక భాగ్య రెడ్డి జెరిపోతుల లక్ష్మన్ ఉన్నారు.



# ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లు వ

ప్రజానావ , వేములవాడ :

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం శంకేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన సదస్సులో ప్రజలనుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులు చేయని వారికోసం ఈ నెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రజా పాలన సదస్సులో సంకేపల్లి తో పాటు ఆరపల్లి, అనుపురం గ్రామాల్లో ప్రజలనుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సంకేపల్లి లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు 14 దరఖాస్తులు , ఇందిరమ్మ ఇండ్ల కోసం 30, నూతన రేషన్ కార్డుల కోసం 79 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఆరపల్లీ లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కి 1, ఇందిరమ్మ ఇండ్ల కోసం 4 , నూతన రేషన్ కార్డుల కోసం 11, రేషన్ కార్డులో పేర్ల నమోదు కోసం 12 దరఖాస్తులు వచ్చాయి. ఆను పురం లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు 56, ఇందిరమ్మ ఇండ్ల కోసం 111, రేషన్ కార్డుల కోసం 211 వినతులు వచ్చినట్టుగా అధికార్లు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఎంపీవో వజీర్ హమ్మద్ , ఆర్ ఐ సుమలత, వీఆర్ఓ బండారి మల్లేశం, చింతపల్లి శ్రీనివాసరావు,రగుడు పర్శరాం, మారవేని రాజు, దోమకొండ జ్యోతి,జింక సంధ్య, బుర్ర శేఖర్, బండారి లక్ష్మి , నాగుల రాము, బండారి శ్రీనివాస్. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# బోణీ కొట్టేదెవరో?

## ఆత్మవిశ్వాసంతో భారత్, భారీ ఆశలతో ఇంగ్లండ్

## నేడు కోల్‌కతాలో తొలి టి20



**కోల్‌కతా:** భారత్‌ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు బుధవారం తెరలేవనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మొదటి మ్యాచ్‌కు రెండు జట్లు సమరోత్సాహంతో సిద్ధమయ్యాయి. సొంత గడ్డపై ఆడుతుండడంతో ఆతిథ్య భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఈ సిరీస్ కోసం యువ ఆటగాళ్లతో కూడిన జట్టును ఎంపిక చేశారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత్ ఆత్మవిశ్వాసంతో పోరుకు సిద్ధమైంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లు, ఆల్‌రౌండర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. ఇంగ్లండ్‌కు పటిష్టమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్‌లోనూ విధ్వంసక ఆటగాళ్లకు కొదవలేదు. కెప్టెన్ జోస్ బట్లర్ జట్టును ముందుండి నడిపించనున్నాడు. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. దీంతో సిరీస్ ఆసక్తికరంగా సాగడం ఖాయం.

### అందరి కళ్లు శాంసన్‌పైనే..

సిరీస్‌లో అందరి కళ్లు టీమిండియా స్టార్ ఆటగాడు సంజు శాంసన్‌పైనే నిలిచాయి. టి20లలో వరుస సెంచరీలతో అదరగొడుతున్న శాంసన్ ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నాడు. యువ సంచలనం అభిషేక్ శర్మతో కలిసి జట్టుకు మెరుపు ఆరంభం అందించాలనే లక్ష్యంతో సంజు పోరుకు సిద్ధమయ్యాడు. అభిషేక్ కూడా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచాలని తహతహలాడుతున్నాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ రూపంలో టీమిండియాకు విధ్వంసకర బ్యాటర్ ఉన్నాడు. టి20లలో సూర్యకు కళ్లు చెదిరే రికార్డు ఉంది. ఈసారి కూడా అతనిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. హైదరాబాదీ తిలక్‌వర్మ కూడా జోరుమీదున్నాడు. గతంలో జరిగిన టి20 సిరీస్‌లలో తిలక్‌వర్మ వరుస సెంచరీలతో అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్‌పై కూడా చెలరేగాలనే పట్టుదలతో ఉన్నాడు. ఓపెనర్లతో పాటు టాప్ ఆర్డర్‌లోని ఇద్దరు రాణిస్తే భారత్‌కు భారీ స్కోరు ఖాయం. ఇక రింకు సింగ్ రూపంలో మరో విధ్వంసక బ్యాటర్ ఉండనే ఉన్నాడు. టి20లలో రింకుకు అద్భుత రికార్డు ఉంది. మరోవైపు నితీష్ కుమార్ రెడి, హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ప్రతిభావంతులైన ఆల్‌రౌండర్లు కూడా జట్టులో ఉన్నారు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా వీరికుంది.

### షమి రాకతో..

మరోవైపు గాయంతో చాలా కాలంగా టీమిండియాకు దూరంగా ఉన్న సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి సిరీస్‌లో బరిలోకి దిగుతున్నాడు. అతని రాకతో జట్టు బౌలింగ్ మరింత మెరుగ్గా మారింది. షమి సిరీస్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారాడు. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అక్షర్, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి తదితరులతో భాతర బౌలింగ్ చాలా బలంగా ఉంది. రెండు విభాగాల్లోనూ పటిష్టంగా ఉన్న టీమిండియా సిరీస్‌లో బోణీ కొట్టాలనే పట్టుదలతో పోరుకు సిద్ధమైంది.

### తక్కువ అంచనా వేయలేం..

ఇక ఇంగ్లండ్‌ను కూడా తక్కువ వేయలేం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఇంగ్లండ్ చాలా బలంగా ఉంది. జోస్ బట్లర్, లివింగ్ స్టోన్, ఫిలిప్ సాల్ట్, హారీ బ్రూక్, బెన్ డకెట్ వంటి విధ్వంసక బ్యాటర్లు జట్టులో ఉన్నారు. అంతేగాక జోఫ్రా ఆర్చర్, అట్కిన్సన్, మార్క్‌వుడ్, రషీద్‌లతో బౌలింగ్ కూడా పటిష్టంగా ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఇంగ్లండ్‌కు కూడా గెలుపు అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి.

### ఇంగ్లాండ్ బృందం తక్కువేం కాదు :

మరోవైపు ఇంగ్లాండ్ కూడా తక్కువేం కాదు. కోచ్‌గా టెస్టు క్రికెట్లో ఇంగ్లాండ్‌కు దూకుడు నేర్పి, ఆ జట్టు ఆటను మరో స్థాయికి తీసుకెళ్లిన మెక్‌కలమ్ ఇప్పుడు పరిమిత ఓవర్లలోనూ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. టెస్టుల్లోనే 'బజ్‌బాల్' ఆటతో టీ20లను తలపించే ఇంగ్లాండ్.. ఇక మెక్‌కలమ్ కోచింగ్‌లో టీ20ల్లో ఎంతలా చెలరేగిపోతోందో అర్థం చేసుకోవచ్చు. గతేడాది టీ20 ప్రపంచకప్ తర్వాత ప్రతి 2.32వ బంతికి బౌండరీ రాబట్టేందుకు ఆ జట్టు ప్రయత్నిస్తోంది. ఆ మెగా టోర్నీ తర్వాత ఒకే మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు 218 పరుగులు సాధించింది. మూడు ఛేదనల్లో ఓవర్‌కు 10కి పైగా పరుగులు చేసింది. బట్లర్, ఫిల్ సాల్ట్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెతెల్, హ్యారీ బ్రూక్ లాంటి ప్రమాదకర ఆటగాళ్లు ఆ జట్టులో ఉన్నారు. ఈ నేపథ్యంలో భారత మైదానాల్లో ఆ జట్టు ఊచకోతకు దిగుతుందనడంలో సందేహం లేదు. భారత్, ఇంగ్లాండ్ బ్యాటింగ్ విధ్వంసంతో మైదానాలు ఊగిపోవడం, రికార్డులు బద్దలవడం ఖాయమనిపిస్తోంది. టీ20 పరిమితుల ను చెరిపేసే దిశగా.. కొత్త రికార్డులకు చిరునామాగా ఈ సిరీస్ ఉండబోతోందనే చెప్పాలి. నిరుడు మార్చిలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 సిరీస్‌లో 12.08 రన్‌రేట్ నమోదైంది. మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో నమోదైన అత్యధిక రన్‌రేట్ ఇదే. ఇప్పుడా రికార్డు ఇంగ్లాండ్, భారత్ సిరీస్‌తో బద్దలయ్యే అవకాశముంది.



రాత్రి 7 గంటల నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

## భారత్‌తో తొలి టీ20.. తుది జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్

వరుసగా టెస్టు సిరీస్ వైఫల్యాలు చవిచూసిన టీమ్‌ఇండియా.. ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే సమరానికి ముందు.. పొట్టి ఫార్మాట్ కిక్కు అందించేందుకు సై అంటోంది. నేటి నుంచే ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 6 నుంచి ఇరుజట్ల మధ్య వన్డే సిరీస్ మొదలవనుంది. అలవోకగా సిక్సర్లు బాదే హిట్టర్లు.. బంతిని బౌండరీలు దాటించే బ్యాటర్లు.. ధనాధన్ ఇన్నింగ్స్‌లతో చెలరేగే ఆల్‌రౌండర్లు.. ఇలా ఏ రకంగా చూసుకున్నా రెండు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ పొట్టి సిరీస్ అభిమానులకు అసలు సిసలు వినోదాన్ని అందించడం ఖాయం. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఒక రోజు ముందే ఇంగ్లాండ్ తుది జట్టును ప్రకటించింది. కెరీర్‌లో మూడు టీ20లు ఆడిన ఫాస్ట్‌బౌలర్ గస్ అట్కిన్సన్ ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. అతను చివరగా 2023 డిసెంబరులో వెస్టిండీస్‌తో జరిగిన టీ20లో ఆడాడు. ఆదిల్ రషీద్‌ను ఏకైక స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకున్నారు. పార్ట్ టైమ్ స్పిన్నర్లు లివింగ్‌స్టన్, జాకబ్ బేథల్‌లను కూడా తుది జట్టులోకి ఎంపిక చేశారు. మరో విషయం ఏంటంటే.. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు 24 టీ20లు జరగ్గా.. ఇంగ్లిష్ జట్టు 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. భారత గడ్డపై 11 మ్యాచ్‌లు ఆడి ఐదుసార్లు గెలిచింది. భారత్‌తో తొలి టీ20కి ఇంగ్లాండ్ తుది జట్టు: బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ (వికెట్ కీపర్), జోస్ బట్లర్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.



## అండర్-19 ప్రపంచ కప్..
## మలేసియాపై భారత్ ఘన విజయం

కౌలాలంపూర్: అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. వెస్టిండీస్‌పై గెలిచి శుభారంభం చేసిన భారత్.. మంగళవారం మలేసియాతో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు విజృంభించడంతో మలేసియా.. 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌటైంది. ఇందులో 11 ఎక్స్‌ట్రాలు ఉండటం గమనార్హం. మలేసియా బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదంటే మన బౌలర్ల జోరు ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. నూర్ అలియా హైరున్ (5), హుస్నా (5) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (27లిబీ 12 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసింది. కమలిని (4లి) పరుగులు చేసింది. భారత బౌలర్ వైష్ణవి శర్మ (5/5) సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆమె తన చివరి ఓవర్‌లో నూర్ ఐన్ బింటి రోస్లాన్ (3), నూర్ ఇస్మా డానియా (0), సితి నజ్వా (0)ను పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించింది. ఆయుషి శుక్లా (3/8) అదరగొట్టింది. వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో (జనవరి 23) శ్రీలంకతో తలపడనుంది.



## ఆర్చర్ చికితకు జగన్‌మోహన్ రావు చేయూత

### అక్షర విద్యాసంస్థల నుంచి 10 లక్షల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్

**హైదరాబాద్:** ఆర్చరీ వరల్డ్‌కప్, ఆసియాకప్‌కు ఎంపికైన పెద్దపల్లి యువ ఆర్చర్ టి.చికితరావుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అండగా నిలిచారు. మంగళవారం సాయంత్రం మాదాపూర్‌లోని జగన్‌మోహన్ రావు కార్యాలయంలో ఆయన్ని చికిత మర్యాదపూర్వకంగా కలిసింది. సాధారణ రైతు కుటుంబ నుంచి అంతర్జాతీయ స్థాయి ఆర్చర్‌గా ఎదిగిన చికితకు సరైన ప్రోత్సాహం లేక ఇబ్బంది పడుతుందని ఆయన దృష్టికి రావడంతో, ఆమెకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అక్షర విద్యాసంస్థల నుంచి చికితకు రూ.పది లక్షల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నామని జగన్‌మోహన్ రావు వెల్లడించారు. తొలి విడతగా రూ.50 వేల చెక్‌ను అందించగా, వచ్చే ఫిబ్రవరి నుంచి తన శిక్షణ నిమిత్తం ప్రతి నెల రూ.15 వేలు ఉపకార వేతనం ఐదేళ్ల పాటు అక్షర విద్యాసంస్థల నుంచి ఇవ్వనున్నామని జగన్‌మోహన్ రావు చెప్పారు.

## అవును.. వాళ్లిద్దరు పెళ్లి చేసుకోబోతున్నారు

### త్వరలోనే ఎంపీ ప్రియతో రింకు వివాహం





పార్లమెంట్ సభ్యురాలు ప్రియ సరోజ్‌ను టీమ్‌ఇండియా క్రికెటర్ రింకు సింగ్ వివాహం చేసుకోబోతున్నాడు. ఈ విషయాన్ని ప్రియ తండ్రి, ఎమ్మెల్యే తుఫాని సరోజ్ స్పష్టం చేశారు. ప్రియతో రింకు నిశ్చితార్థం జరిగిందని వచ్చిన వార్తలను ఇటీవల ఖండించిన తుఫాని.. రింకు కుటుంబ సభ్యులతో చర్చలు జరుగుతున్నాయని మాత్రమే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ ఇద్దరి పెళ్లికి రెండు కుటుంబాలు అంగీకరించాయని సోమవారం ఆయన తెలిపారు. "రింకు, ప్రియకు ఏడాది ముందు నుంచే పరిచయం ఉంది. వాళ్లిద్దరు ఒకరినొకరు ఇష్టపడ్డారు. కానీ పెళ్లి చేసుకోవడానికి ఇరు కుటుంబాల అంగీకారం కోసం ఎదురు చూశారు. వీళ్ల వివాహానికి రెండు కుటుంబాలు ఒప్పుకొన్నాయి. ఇప్పటివరకూ నిశ్చితార్థం లాంటిది ఏం జరగలేదు. పార్లమెంట్ సమావేశాల తర్వాత నిశ్చితార్థం, వివాహం తేదీలను నిర్ణయిస్తాం. లఖ్‌నవూలో నిశ్చితార్థం జరుగుతుంది" అని మూడు సార్లు ఎంపీగా పనిచేసిన తుఫాని పేర్కొన్నారు. మచిలీషహర్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరపున పార్లమెంట్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న 25 ఏళ్ల ప్రియ గతంలో సుప్రీం కోర్టు న్యాయవాదిగా పనిచేశారు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తలపడే టీమ్‌ఇండియాలో రింకు ఉన్న సంగతి తెలిసిందే.



## భారీ రికార్డుకు చేరువలో అర్ష్‌దీప్ సింగ్

టీమ్‌ఇండియా యువ ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ టీ20ల్లో భారీ రికార్డుకు అతి చేరువలో ఉన్నాడు. అతను టీ20ల్లో మరో రెండు వికెట్లు పడగొడితే పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలవనున్నాడు. జనవరి 22 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టీ20 సిరీస్‌కు అర్ష్‌దీప్ ఈ రికార్డు అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (96 వికెట్లు, 80 మ్యాచ్‌లు) టాప్‌లో ఉన్నాడు. అర్ష్‌దీప్ (95 వికెట్లు, 60 మ్యాచ్‌లు) రెండో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్‌లో ఈ యంగ్ పేసర్ ఐదు వికెట్లు పడగొడితే టీ20ల్లో 100 వికెట్లు సాధించిన తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. టీ20ల్లో అర్ష్‌దీప్ సింగ్‌కు మంచి రికార్డు ఉంది. గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఛాంపియన్‌గా నిలవడంలో ఇతను కీలకపాత్ర పోషించాడు. 8 మ్యాచ్‌ల్లో కలిపి 17 వికెట్లు సాధించాడు. ఇంగ్లాండ్‌తో టీ20, వన్డే సిరీస్‌కు ఎంపికైన అర్ష్‌దీప్.. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు.

## సెమీస్‌లో సబలెంక, జకోవిచ్

### బడోసా, జ్వరేవ్ ముందుకు

### గాఫ్, అల్కరాజ్ ఇంటికి, ఆస్ట్రేలియా ఓపెన్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ అరినా సబలెంక (బెలారస్), 11వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్) సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వరేవ్ (జర్మనీ), ఏడో సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) క్వార్టర్ ఫైనల్ పోటీల్లో విజయం సాధించి ముందంజ వేశారు. మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), 12వ సీడ్ పాల్ (అమెరికా) ఇంటిదారి పట్టారు. మహిళల విభాగంలో మూడో సీడ్ కొకొ గాఫ్ క్వార్టర్ ఫైనల్లోనే కంగుతిన్నది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అల్కరాజ్ క్వార్టర్ ఫైనల్లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచాడు. జకోవిచ్‌తో జరిగిన పోరులో ఓటమి పాలయ్యాడు. అద్భుత ఆటతో అలరించిన జకోవిచ్ 46, 64, 63, 64తో అల్కరాజ్‌ను మట్టికరిపించాడు. తొలి సెట్‌లో అల్కరాజ్ పైచేయి సాధించాడు. నిలకడైన ఆటతో సెట్‌ను దక్కించుకున్నాడు. కానీ తర్వాత జకోవిచ్ పుంజుకున్నాడు. తన మార్క్ ఆటతో అల్కరాజ్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. ఇదే క్రమంలో వరుసగా మూడు సెట్లు గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో జ్వరేవ్ జయకేతనం ఎగుర వేశాడు. పాల్‌తో జరిగిన పోరులో జ్వరేవ్ 76, 76, 26, 61తో విజయం సాధించాడు. తొలి సెట్లలో హొరాహోరీ తప్పలేదు. పాల్ నుంచి జ్వరేవ్‌కు గట్టి పోటీ ఎదురైంది. అయితే టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్లలో జ్వరేవ్ జయభేరి మోగించాడు. మూడో సెట్‌లో పాల్ అలవోకగా నెగ్గాడు. కానీ నాలుగో సెట్‌లో జ్వరేవ్ మళ్లీ చెలరేగి పోయాడు. అలవోకగా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి ముందంజ వేశాడు.

### సబలెంక జోరు..

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక సెమీస్‌కు చేరుకుంది. రష్యా క్రీడాకారిణి పావ్లిచెంకొవాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అరిన 62, 26, 63తో విజయం సాధించింది. తొలి సెట్‌లో సబలెంక పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సెట్‌ను దక్కించుకుంది. కానీ రెండో సెట్‌లో అరినాకు చుక్కెదురైంది. పావ్లిచెంకొవా అద్భుత ఆటతో సబలెంకను హడలెత్తించింది. ఇదే క్రమంలో సెట్‌ను కూడా సొంతం చేసుకుంది. కానీ కీలకమైన మూడో సెట్‌లో మళ్లీ సబలెంక పైచేయి సాధించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సెట్‌ను గెలిచి సెమీస్‌కు చేరుకుంది. మరో పోటీలో బడోసా 75, 64తో కొకొ గాఫ్‌ను కంగుతినిపించింది. ఆసక్తికరంగా సాగిన పోరులో బడోసా అసాధారణ ఆటతో గాఫ్‌ను మట్టికరిపించింది. కాగా, మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్), జాంగ్ (చైనా) జోడీ పరాజయం చవిచూసింది.

# హైదరాబాద్ సీపీకి మళ్లీ ఫిర్యాదు చేసిన మాధవీలత

బీజేపీ నేత, సినీ నటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతోంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఇప్పటికే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. జేసీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీ మాటలతో తాను, తన కుటుంబం ఎంతగానో ఇబ్బంది పడిందని ఈ సందర్భంగా మాధవీలత అన్నారు. క్షమాపణ చెప్పానంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఇలాంటి భాష మాట్లాడితే ఎలా అని నిలదీశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్క్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అయితే ఆ వేడుకలకు వెళ్లవద్దని.. అక్కడ మహిళలకు రక్షణ ఉండదని మాధవీలత ఒక వీడియో రిలీజ్ చేశారు. దీనిపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మాధవీలత ఒక సినిమా యాక్టర్ అని.. యాక్టర్స్ అంతా ప్రాస్టిట్యూట్స్‌నే అని పరుష పదజాలంతో విమర్శించారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. దీనిపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. దీంతో వెనక్కి తగ్గిన జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. తన వయసు 72 సంవత్సరాలు అని.. ఆవేశంలో అలా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరచాలనే ఉద్దేశంతో మాట్లాడలేదని వివరించారు. ఎవరి బతుకుదెరువు వారిదేనని అన్నారు. మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని తెలిపారు. మాధవీలతను క్షమాపణలు కోరారు. జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం ముగిసిపోతుందని అంతా అనుకున్నారు. కానీ మాధవీలత మాత్రం జేసీని క్షమించలేదు. ఆ విషయాన్ని ఎంతలా మరిచిపోదామన్న తన వల్ల కావడం లేదని అప్పట్లోనే ఒక వీడియోను కూడా రిలీజ్ చేశారు. 'చాలా ప్రయత్నం చేశా.. కానీ నేను మనిషినే.. నా ఆత్మ గౌరవం మీద జరిగిన దాడి.. నాకున్న బాధను వర్ణించే పదాలు లేవు. ప్రతిక్షణం వేదనతో నిండి ఉంది. కోపం, నిరాశ, ఆవేదన, దుఃఖం.. అన్నీ ఒకేసారి నన్ను కుదిపేస్తున్నాయి.' అని మాధవీలత అన్నారు. ఎన్నోసార్లు ఎందరో తన ఆత్మవిశ్వాసాన్ని చిదిమివేయాలని ప్రయత్నం చేశారని.. పదే పదే ఇవే మాటలన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), ఫిలిం ఛాంబర్‌లో మాధవీలత ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు.






# అవతార్ 3..

## ప్రేక్షకుల ఊహకు మించి ఉంటుంది : జేమ్స్ కామెరూన్


జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్'. దీని రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రేక్షకాదరణను పొంది రూ.కోట్లు వసూలు చేశాయి. ఇప్పుడు దీని మూడో భాగం భారీ అంచనాల మధ్య తెరకెక్కనుంది. 'అవతార్–ఫైర్ అండ్ యాష్' పేరుతో రానున్న ఈ సినిమాపై జేమ్స్ కామెరూన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గత రెండు చిత్రాలతో పోలిస్తే దీని నిడివి కూడా రెట్టింపు ఉంటుందన్నారు. "ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం ఉంటుంది. తెరపై ఈ విజువల్ వండర్‌ను చూసిన తర్వాత ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతారు. గతంలోని రెండు చిత్రాల్లో చూపిన వాటిని ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకుంటున్నాం. వాటికి బదులుగా కొన్ని ధైర్యమైన ఎంపికలతో మీ ముందుకు వస్తాను. ఇలా ధైర్యం చేసి కొన్నింటిని సృష్టించకపోతే ప్రతిఒక్కరి సమయాన్ని, డబ్బును వృథా చేసినవాడిని అవుతాను. రెండు భాగాల్లో లేని అద్భుతాలను అవతార్ మూడో పార్ట్‌లో చూస్తారు. మీ అంచనాలకు మించిన లైవ్‌–యాక్షన్‌ని ఇందులో చూస్తారు. మరో కొత్త ప్రపంచం భిన్నమైన కథనం, విభిన్నమైన పాత్రలు ఇందులో కనిపిస్తాయి. ఈసారి పాత్రలపై ఎక్కువ దృష్టి పెడుతున్నాం" అని చెప్పారు. ప్రపంచ చిత్ర పరిశ్రమలో 'అవతార్' ఓ సంచలనం. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ఓ అద్భుత ప్రపంచమిది. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో అందరినీ కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'తో మంచి ట్రీట్ ఇచ్చారు. ఆ ఫ్రాంచైజీలో రానున్న మూడో భాగాన్ని పంచ భూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందించనున్నారు. 2025 డిసెంబరు 19న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న 'అవతార్ 4' 2029లో, చివరిగా రానున్న 'అవతార్ 5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.



# తండ్రి కాబోతున్న కిరణ్ అబ్బవరం.. ఫొటో షేర్ చేసిన హీరో

టాలీవుడ్ హీరో కిరణ్ అబ్బవరం శుభవార్త చెప్పారు. తాను తండ్రిని కాబోతున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని తెలుపుతూ మంగళవారం ఉదయం పోస్ట్ పెట్టారు. తన సతీమణి రహస్యతో దిగిన స్పెషల్ ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. 'మా ప్రేమ పెరుగుతోంది' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ సంతోషకరమైన సమయంలో అందరి ఆశీస్సులు తమకు ఉండాలని కోరుకున్నారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. కిరణ్–రహస్య దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'రాజావారు.. రాణిగారు' (2019)తో కిరణ్ తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అందులో రహస్య హీరోయిన్‌గా నటించారు. ఆ మూవీ షూటింగ్‌లోనే ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం.. తర్వాత ప్రేమగా మారింది. గతేడాది ఆగస్టులో వీరిద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కుటుంబసభ్యులు, కొద్దిమంది అతిథుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'క'తో కిరణ్ అబ్బవరం సూపర్‌హిట్‌ను అందుకున్నారు.

# ఏసుబాయిగా రష్మిక



పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠి భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠి భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.

# ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సైఫ్



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గత వారం సైఫ్ ఇంటికి చోరీకి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి అనంతరం తీవ్ర గాయాలతో లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరు రోజుల చికిత్స అనంతరం ఇవాళ డిశ్చార్జ్ అయ్యారు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు వైద్యులు సూచించారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఎక్కువమంది ఆయన వద్దకు రాకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈనెల 16న సైఫ్ ఇంటికి చోరీకి వెళ్లిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరుసార్లు సైఫ్‌ను దుండగుడు కత్తితో పొడిచాడు. గురువారం తెల్లవారుజామున 2:30 ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నటుడికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. మరోవైపు సైఫ్‌పై దాడి కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను శనివారం అర్ధరాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా క్రైమ్‌సీన్ రీక్రియేషన్ కోసం నిందితుడిని సైఫ్ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. నిందితుడి వేలిముద్రలను కూడా తీసుకున్నారు.



# చిలుకూరు ఆలయంలో ప్రియాంకా చోప్రా..

## కొత్త ప్రయాణమంటూ పోస్టు

ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా హైదరాబాద్ నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. సంబంధిత ఫొటోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బాలాజీ ఆశీస్సులతో కొత్త ప్రయాణం మొదలు పెడుతున్నట్టు తెలిపారు. లాస్ ఏంజెలెస్ నుంచి ఆమె కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న %బూవీదీ%29 (వర్కింగ్ టైటిల్)లో ప్రియాంక హీరోయిన్‌గా ఎంపికయ్యారంటూ ఇటీవల వార్తలొచ్చాయి. ఆ ప్రాజెక్టు కోసమే ఆమె హైదరాబాద్ వచ్చారంటూ నెట్టింట చర్చ జరిగింది. ఆ సినిమాని ఉద్దేశించే కొత్త ప్రయాణమని చెప్పినట్టు పలువురు సినీ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

# ధనుష్‌కు బిచ్చగాడి పాత్ర గురించి చెప్పడానికి సంకోచించా : శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి శేఖర్ కమ్ముల ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ కథ ధనుష్‌కు చెప్పడానికి కాస్త సంకోచించినట్లు ఆయన తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "కుబేర' కథ సిద్ధమైంది. బిచ్చగాడి పాత్ర గురించి ధనుష్‌కు ఎలా చెప్పాలా?అని కాస్త సంకోచించా! ఎందుకంటే అసలు నేను ఆయనకు తెలుసో లేదోనన్న అనుమానం కూడా నన్ను వెంటాడింది. నేను ఆయనకు ఫోన్ చేయగానే, ధనుష్ నన్ను ఆశ్చర్యపరిచారు. నేను తీసిన వాటిలో ఆయన ఫేవరెట్ మూవీలు, అందులోని సన్నివేశాల గురించి మాట్లాడటం మొదలు పెట్టారు. ధనుష్‌లాంటి నటుడితో పనిచేయడం సంతోషంగా ఉంది" అని శేఖర్‌కమ్ముల చెప్పుకొచ్చారు. ఇక వరుస చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. ఆమె గురించి మాట్లాడుతూ.. "రష్మిక చాలా కష్టపడతారు. ఈ కథ చెప్పడానికి వెళ్లినప్పుడు ముంబయిలో ఆమె 'యానిమల్' మూవీ డబ్బింగ్ చెబుతున్నారు. అదే సమయంలో 'పుష్ప2' షూటింగ్ కూడా జరుగుతోంది. ముంబయి నుంచి హైదరాబాద్‌కు విరామం లేకుండా ప్రయాణిస్తూనే ఉన్నారు. 'కుబేర' సెట్‌కు వచ్చినప్పుడు ఒక్కరోజు కూడా ఆమెలో నీరసం, నిస్సత్తువ కనిపించలేదు. నిజంగా ఆమె ఒక మెరుపు. ఇందులో మీ పక్కంటి అమ్మాయిగా రష్మిక కనిపిస్తారు. ఇప్పటివరకూ రష్మిక, ధనుష్ కలిసి నటించడం చూడలేదు. ఇందులో వారి స్క్రీన్ ప్రజెన్స్ చాలా కొత్తగా ఉంటుంది" అని శేఖర్ కమ్ముల అన్నారు. ఇదొక భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్నట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది. ఇందులో ధనుష్ మునుపెన్నడూ చేయని కొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజకీయాంశాలకూ ఇందులో పెద్ద పీట వేసినట్లు తెలుస్తోంది. పైకి బిచ్చగాడిగా (ధనుష్) కనిపిస్తున్న వ్యక్తి ఎవరు? అతను ఎందుకు అలా మారాల్సి వచ్చింది? అతని నేపథ్యం ఏంటన్నది ఆసక్తికరంగా చూపించబోతున్నారు. నాగార్జున ఇందులో ఈడీ అధికారి పాత్ర పోషిస్తున్నట్లు టాక్.








Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : TELTEL/2023/87657